

## అదరగొట్టిన గురుకుల బాక్సర్లు


హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ ఆరవ జూనియర్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఎస్సీ గురుకులాల బాక్సర్లు అదరగొట్టారు. వివిధ విభాగాల్లో బరిలోకి దిగిన బాక్సర్లు ఆరు పతకాలు కొల్లగొట్టారు. తమ అద్భుత ప్రదర్శన కనబరుస్తూ ప్రత్యర్థి బాక్సర్లను మట్టికరిపించిన గురుకుల బాక్సర్లు సత్తాచాటారు. నిఖిత(కోకట్), శ్రీలేఖ(గోపాల్‌పేట్) పసిడి పతకాలు కైవసం చేసుకోగా, మంజుల(నాచర్ల), రాకేశ్(పర్కాల్)కు రజతాలు, సంజన(యెర్రుపాలెం), కార్తీక(మడికొండ)కు కాంస్య పతకాలు దక్కాయి. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన బాక్సర్లను గురుకుల విద్యాసంస్థల ప్రతినిధులు అభినందించారు.

## భవానీదేవి కొత్త చరిత్ర

**ఏషియన్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం**



న్యూఢిల్లీ: భారత స్టార్ ఫెన్సర్ భవానీ దేవి కొత్త చరిత్ర లిఖించింది. ఏషియన్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో భవాని కాంస్య పతకంతో మెరిసింది. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో భారత్ తరఫున పతకం సాధించిన తొలి ఫెన్సర్‌గా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. సోమవారం జరిగిన మహిళల సాబ్రె విభాగపు పోరులో వుక్సి(చైనా) చేతిలో ఓడిన భవాని కాంస్యాన్ని ఖాతాలో వేసుకుంది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో భవాని 14-15 తేడాతో జైనబ్ దైబెకోవా(ఉజ్బెకిస్థాన్)పై పోరాడి ఓడింది. ఏషియన్ ఫెన్సింగ్ టోర్నీలో కాంస్య పతకం సాధించిన దేవిని జాతీయ ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజీవ్ మెహతా అభినందించారు. భారత ఫెన్సింగ్‌కు ఇది గర్వకారణమైన రోజు అని పేర్కొన్నారు.



## నాటింగ్‌హామ్ విజేత ముర్రే

నాటింగ్‌హామ్ : వింబుల్డన్ సన్నద్ధతలో భాగంగా ఆండీ ముర్రే నాటింగ్‌హామ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ టైటిల్ గెలుచుకున్నాడు. ఫైనల్లో ముర్రే 6-4, 6-4 స్కోరుతో ఫ్రెంచ్ ఆటగాడు ఆర్థర్ కజాక్స్‌పై గెలుపొందాడు. ఇటీవల సర్బిటన్‌లో టైటిల్ నెగ్గిన ముర్రే పచ్చిక కోర్టులలో వరుసగా రెండో టైటిల్ గెలిచాడు. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత ముర్రే ఈ టోర్నీలో ఎదురులేని ప్రదర్శన చేసి నాలుగు బ్రేక్ పాయింట్లను సద్వినియోగం చేసుకున్నాడు. ఈ టోర్నీలో ఆడిన అయిదు మ్యాచ్‌లలో ముర్రే ఒక్క సెట్‌నుకూడా ప్రత్యర్థులకు కోల్పోలేదు. కాగా సోమవారం ఆరంభం కానున్న క్వీన్స్ క్లబ్ చాంపియన్‌షిప్‌లో ముర్రే తదుపరి టైటిల్ వేట కొనసాగించనున్నాడు.

## రైల్వే ప్రమాద బాధితులకు ఫుట్‌బాల్ జట్టు వితరణ



భువనేశ్వర్ : ఇంటర్ కాంటినెంటల్ కప్ గెలుచుకున్న భారత ఫుట్‌బాల్ జట్టు వితరణ ప్రదర్శించింది. విజేతలకు ఒడిషా ప్రభుత్వం ప్రకటించిన కోటి రూపాయల నజరానానుంచి రూ.20 లక్షలు బాలాసోర్ రైలు ప్రమాద బాధితులకు విరాళంగా అందజేయనుంది. భారత ఫుట్‌బాల్ జట్టు ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫైనల్లో 2-0తో లెబనాన్‌ను ఓడించి విజేతగా నిలిచింది. దీనితో ఒడిషా ప్రభుత్వం భారత జట్టుకు కోటి రూపాయల నజరానా ప్రకటించింది. తమ నగదు బహుమతిలో రూ.20 లక్షలను ఇటీవల బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాద బాధితులకు అందజేయాలని ఫుట్‌బాల్ జట్టు కోరింది.

## కృష్ణ తీన్మార్



హైదరాబాద్, ఆట ప్రతినిధి: సాట్స్ షూటింగ్ రేంజ్ వేదికగా జరిగిన తెలంగాణ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తురగ శ్రీజిత్‌కృష్ణ మూడు స్వర్ణ పతకాలతో మెరిశాడు. జూనియర్ మెన్ 10 మీటర్ల రైఫిల్ విభాగంలో 391/400 స్కోరుతో కృష్ణ పసిడి దక్కించుకోగా, అదే జోరు కనబరుస్తూ యూత్ మెన్, సబ్‌యూత్ మెన్ విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించి ఔరా అనిపించాడు.



### స్విమ్మింగ్ కోచ్‌గా ఆయూశ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: బెర్లిన్ వేదికగా జూన్ 17 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న స్పెషల్ ఒలింపిక్స్ గేమ్స్‌లో భారత స్విమ్మింగ్ జట్టుకు రాష్ట్రానికి చెందిన ఆయూశ్ యాదవ్ కోచ్‌గా నియమితుడయ్యాడు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీలో మొత్తం 26 క్రీడాంశాల్లో పోటీలు జరుగనున్నాయి. భారత్ నుంచి 198 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు.

# నువ్వా నేనా

**హోరాహోరీగా యాషెస్ తొలి టెస్టు • ఆసీస్ లక్ష్యం 281, ప్రస్తుతం 107/3**

**ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య యాషెస్ సిరీస్ తొలి టెస్టు హోరాహోరీగా సాగుతున్నది. టెస్టుల్లో కొత్త సంప్రదాయానికి తెరతీసిన 'బజ్‌బాల్' శైలితో ఇంగ్లండ్ దూకుడు కనబరుస్తుంటే..ఆసీస్ అంతే దీటుగా సై అంటున్నది. దీంతో ఆధిక్యం చేతులు మారుతున్న మ్యాచ్‌లో విజయం ఎవరిని వరిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.**

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను ఎలాగైనా దక్కించుకోవాలన్న పట్టుదల కనబరుస్తున్న ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ ఢీ అంటే ఢీ అన్నట్లు తలపడుతున్నాయి. ఇంగ్లండ్ నిర్దేశించిన 281 పరుగుల లక్ష్యఛేదనలో రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ మూడు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. జరుగుతున్నది టెస్టు మ్యాచ్ అయినా పరిమిత ఓవర్ల ఫార్మాట్‌ను తలపిస్తూ ఇరు జట్ల బ్యాటర్లు తమదైన దూకుడు ప్రదర్శిస్తున్నారు. నిర్దేశిత లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్‌కు మెరుగైన శుభారంభమే దక్కింది. ఫామ్‌లేమితో సతమతమవుతున్న వార్నర్(36) ఫర్వాలేదనపించగా, తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఉస్మాన్ ఖవాజ(34 నాటౌట్) అద్భుత పోరాట పటిమ కనబరుస్తున్నాడు. ఇంగ్లండ్ బౌలింగ్‌ను కాచుకుంటూ వీరిద్దరు లక్ష్యఛేదనను ప్రారంభించారు. ఇన్నింగ్స్ సాఫీగా సాగుతున్న సమయంలో వార్నర్‌ను రాబిన్సన్ ఔట్ చేయడం ద్వారా ఆసీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. వార్నర్ వెనుదిరుగడంతో తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన లబుషేన్(13) మరోమారు నిరాశపరిచాడు. క్లిష్ట సమయాల్లో జట్టును గట్టెక్కించే లబుషేన్(13) బ్రాడ్ బౌలింగ్‌లో బెయిర్‌స్టోకు క్యాచ్ ఇచ్చి రెండో వికెట్‌గా నిష్క్రమించాడు. జట్టును ఆదుకుంటాడనుకున్న స్టీవ్ స్మిత్(6)..బ్రాడ్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. చేతిలో ఏడు వికెట్లు ఉన్న ఆసీస్ విజయానికి 174 పరుగుల దూరంలో ఉంది.

**ఇంగ్లండ్ 273 ఆలౌట్:**

ఓవర్‌నైట్ స్కోరు 28/2 నాలుగో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమదైన రీతిలో దూకుడు మంత్రాన్ని పటించింది. బ్యాటర్లు ఆది నుంచే బాదుడు మొదలుపెట్టారు. ముఖ్యంగా జో రూట్(46), హ్యారీ బ్రూక్(46), కెప్టెన్ బెన్ స్టోక్స్(43) కీలక పరుగులు జత చేశారు. ఆసీస్ బౌలింగ్‌ను సమర్థంగా నిలువరిస్తూ వైవిధ్యమైన షాట్లతో స్కోరు బోర్డుకు పరుగులు జతచేశారు. ఇన్‌ఫామ్ బ్యాటర్ రూట్..ర్యాంప్ షాట్లతో టీ20 ఫార్మాట్ బ్యాటింగ్‌ను తలపించాడు. అయితే మరో ఎండ్‌లో కమిన్స్(4/63), లియాన్(4/80) బౌలింగ్‌తో ఇంగ్లండ్‌ను ఇబ్బందులకు గురిచేశారు. వీరిద్దరు ఇంగ్లండ్ భారీ స్కోరు ఆశలకు గండికొట్టారు.



కమిన్స్(4/63)

### సంక్షిప్త స్కోర్లు

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 393/8 డిక్లేర్డ్, **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్:** 386, **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 273 ఆలౌట్, **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 103/3

## అశ్విని-తనీష జోడికి టైటిల్



నాంటెస్(ఫ్రాన్స్) : నాంటెస్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత మహిళల జోడి అశ్విని పొన్నప్ప-తనీష కాస్ట్రో మహిళల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకున్నారు. ఫైనల్లో 21-15, 21-14 స్కోరుతో చైనీస్ తైపీకి చెందిన హంగ్ ఎన్‌జు-లిన్ యు పీని ఓడించి చాంపియన్లుగా నిలిచారు. తొలి గేమ్‌లో 0-4తో వెనుకంజలో ఉన్న భారత జోడి తరువాత పుంజుకుని స్కోరును 10-10గా సమంచేసి, ఆపై జోరును పెంచి గేమ్‌ను గెలుచుకున్నారు.

## నేటి నుంచి తైపీ ఓపెన్



తైపీ : మంగళవారంనుంచి ఆరంభం కానున్న తైపీ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో హెచ్‌ఎస్ ప్రణయ్‌పైనే భారత్ ఆశలన్నీ. ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ ఇక్కడ మూడో సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు. తొలి రౌండ్‌లో ప్రణయ్ క్వాలిఫయర్‌తో తలపడనున్నాడు. గత నెలలో మలేసియా మాస్టర్స్ సూపర్300 టోర్నీ టైటిల్ గెలిచిన ప్రణయ్ గత వారం జరిగిన ఇండోనేసియా ఓపెన్ సూపర్1000 టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకుని అక్కడ ప్రపంచ నంబర్‌వన్ చేతిలో ఓడిపోయాడు. ఈసారి తైపీ ఓపెన్‌లో టైటిల్‌పై గురిపెట్టాడు. మహిళల విభాగంలో సైనా నెహ్వాల్, మాళవిక బన్సాద్, ఆకర్షి కశ్యప్, రుత్విక శివాని బరిలో ఉన్నారు. ఇండోనేసియా ఓపెన్ టైటిల్ గెలిచిన భారత పురుషుల జోడి సాత్విక్-చిరాగ్ ఈ టోర్నీలో పాల్గొనడం లేదు. వారి స్థానంలో కృష్ణ ప్రసాద్-విష్ణువర్ధన్, మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ పాండా-శ్వేతపర్ణ పాండా, మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-సిక్కిరెడ్డి పోటీపడనున్నారు.

## జూలై 13 నుంచి యూటీటీ లీగ్



ముంబై: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ లీగ్ (యూటీటీ) నాలుగో సీజన్ షెడ్యూల్ సోమవారం విడుదలైంది. పుణెలోని బలేవాడీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా జూలై 13 నుంచి 30వ తేదీ వరకు యూటీటీ చాంపియన్‌షిప్ జరుగనుంది. మొత్తం ఆరు ఫ్రాంచైజీలు లీగ్‌లో తలపడనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై లయన్స్, పుణెరి పల్టాన్ మధ్య మ్యాచ్‌తో లీగ్‌కు తెరలేవనుంది. లీగ్‌లో మొత్తం 18 మ్యాచ్‌లు జరుగనుండగా, జూలై 28, 29తేదీల్లో సెమీఫైనల్స్, 30వ తేదీన ఫైనల్ పోరు జరుగుతుంది. చెన్నై, పుణెతో పాటు బెంగళూరు స్మాషర్స్, దబాంగ్ ఢిల్లీ, గోవా చాలెంజర్స్, యూ ముంబా జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. యూటీటీ లీగ్‌లో ఈసారి ఖాద్రీ, లిలీజాంగ్, శరత్‌కమల్, మనికా బాత్రా, సాతియాన్, శ్రీజ, స్నేహిత్ లాంటి స్టార్ ప్లేయర్లు పోటీకి సై అంటున్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.